## ఎమ్మెల్యే గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

న్యాల్‌కల్, అక్టోబర్ 24: జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గెలుపునకు ప్రతి నాయకుడు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మల్గి సర్పంచ్ మారుతీయాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సిద్దారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివనంద శ్రీపతి, నాయకులు విఠల్, బాలాజీ, ఏక్‌నాథ్, భీమన్న, అఖిల్‌మియా, శ్రీకాంత్, మహేశ్, నగేశ్, కార్తిక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్గి సర్పంచ్ మారుతీయాదవ్

## ఖమ్మంపల్లిలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు

మునిపల్లి, అక్టోబర్ 24: వచ్చే ఎన్నికల్లో మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ అవ్వడం ఖాయమని మునిపల్లి జడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఖమ్మంపల్లిలో నవరాత్రుల సందర్భంగా దుర్గామాత వద్ద మునిపల్లి జడ్పీటీసీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమమే మూడోసారి సీఎంను చేస్తాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని, అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ భారీ మెజార్టీతో గెలుపొందాలని దుర్గామాతకు మొక్కుకున్నట్లు జడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సాయికుమార్ ఉన్నారు.

## ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

మనూరు, అక్టోబర్ 24 : దేవీ నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. తొమ్మిది రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా దుర్గామాత భక్తులకు ప్రతి రోజూ ఒక రూపంలో తొమ్మిది అవతారాల్లో దర్శనమిచ్చింది. విజయదశమి పండుగతో ఉత్సవాలు ముగిశాయి. దీంతో యువకులు గ్రామాల్లో ప్రత్యేక మండపాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలకు భారీ ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోచాపూర్‌లో దుర్గా భవానీ శోభాయాత్ర

సిర్గాపూర్, అక్టోబర్ 24 : మండలంలోని పోచాపూర్‌లో దుర్గాభవానీ మాత శోభాయాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నవరాత్రులు పూర్తి చేసుకొని విజయదశమి రోజు అమ్మవారిని యువకులు శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక నిర్వాహకులు ఊరేగింపులో హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని చేపట్టి అందరితో చాలీసా పారాయణం చేయించారు. కార్యక్రమంలో సాయిలు, పండరి, జంగం మల్లేశం, పాండు, సచిన్, హరీశ్, శేఖర్, మహేందర్ పాల్గొన్నారు.



పోచాపూర్‌లో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

## యువకుడి అదృశ్యం



న్యాల్‌కల్, అక్టోబర్ 24: మండలంలోని మెటల్‌కుంట గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యం అయినట్టు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక గ్రామానికి చెందిన గున్నాల విష్ణువర్ధన్‌రెడ్డి(23) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. యువకుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంతవెతికినా ఎక్కడ ఆచూకీ లభించలేదన్నారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. యువకుడి సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు.



న్యాల్‌కల్ : హద్నూర్ గ్రామంలో జమ్మి పూజకు ఊరేగింపుతో తరలివెళ్తున్న ప్రజలు



మనూరు : మాయికోడ్ జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు



కంగ్టి : జమ్మిచెట్టు వద్ద పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ప్రజలు

# మిన్నంటిన దసరా సంబురాలు

విజయదశమిని పురస్కరించుకుని సోమ, మంగళవారాల్లో దసరా ఉత్సవాలు అంబరాన్నంటాయి. పట్టణాలు, గ్రామాల్లో చిన్నారు నుంచి పెద్దల వరకు నూతన వస్త్రాలను ధరించి గ్రామాల్లోని వాడవాడల్లో సంప్రదాయబద్ధంగా పండుగ వేడుకలు కొనసాగాయి. పిల్లాపాపలతో కలిసి భాజాబజంత్రీలతో ఊరేగింపుతో గ్రామాల సమీపంలో ఏర్పాటు చేసిన జమ్మి పూజకు తరలివెళ్లారు. మండలంలోని గ్రామాల సమీపంలో ఏర్పాటు చేసిన జమ్మిచెట్టుకు వేదపండితులు ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం గ్రామాల్లోని ఆలయాలు, ఇండ్లలో ప్రతిష్ఠించిన అమ్మవార్లకు జమ్మి ఆకును పెట్టి దర్శించుకొన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఒకరికొక్కరూ అలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలను చెప్పుకున్నారు.

- జోన్‌బృందం, అక్టోబర్ 24



కోహీర్ : దిగ్వాల్ గ్రామంలో శమీ చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



మునిపల్లి : మక్తక్యాసారంలో జమ్మి చెట్టుకు పూజ



నారాయణఖేడ్ : ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజలు

## అమ్మవారిని సన్నిధిలో కుంకుమార్చన

అందోల్, అక్టోబర్ 24 : శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం టేక్మాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సతీమణి పద్మావతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 100 మంది మహిళలతో కలిసి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పడుతున్నదని అందోల్‌లో రెండోసారి భారీ మెజార్టీతో గులాబీ జెండాను ఎగురవేస్తామన్నారు. పార్టీ శ్రేణులందరూ బీఆర్ఎస్ విజయం కోసం ఎంతో కృషిచేస్తున్నారని.. మరికొన్ని రోజులు ఇలాగే కష్టపడి పని చేయాలన్నారు.

కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుప్రజాభాస్కర్, పార్టీ మండలాధ్యక్షుడు వీరప్ప, సర్పంచ్‌లఫోరం అధ్యక్షురాలు శ్వేత, సర్పంచులు కల్పన, లావణ్య, మాజీ సర్పంచ్ వరలక్ష్మి పాల్గొన్నారు.



దుర్గామాత వద్ద మహిళలతో కలిసి కుంకుమార్చనలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి పద్మావతి

## మహిషాసుర మర్దిని అలంకారంలో భవానీ అమ్మవారు

బొల్లారం, అక్టోబర్ 24: బొల్లారం మున్సిపాలిటీలోని కేబీఆర్ కాలనీ భవాని శంకర ఆలయంలో శరన్నవరాత్రుల్లో చివరి రోజైన సోమవారం అమ్మవారు భక్తులకు మహిమాన్వితమైన మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నాగార్జునాచార్యుల ఆధ్వర్యంలో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజులపాటు ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహార్నవమితో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.

## భవానీమాత వద్ద ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు

కంగ్టి, అక్టోబర్ 24 : మండలంలోని చౌకన్‌పల్లిలో సోమవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి భవానీమాత వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మరోమారు అధికారంలోకి రావడం ఖాయమన్నారు. గత ప్రభుత్వాలు గ్రామాలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అప్పట్లో సమస్యలు తాండవించేవన్నారు. అన్ని వర్గాల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అంతకుముందు జీర్గితండాలో భవానీమాత విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీతావెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజు పాటిల్, కిరణ్ పాల్గొన్నారు.



చౌకన్‌పల్లిలో భవానీమాత వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## నేడు అమ్మవారి విగ్రహాల నిమజ్జనం

కోహీర్, అక్టోబర్ 24 : మండలంలోని దిగ్వాల్, పీచెర్యాగడి, గురుజవాడ, చింతల్‌ఘాట్ గ్రామాల్లో దేవీశరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేయనున్నారు. తొమ్మిది రోజుల పాటు ఒక్కో అవతారంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేయనున్నారు.